# ది గెస్ట్



## మల్లాది వెంకట కృష్ణమూర్తి

## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## *(గత సంచిక తరువాయి)*

బెనర్జీ ఫ్లవర్ షోలో పరిచయం చేసుకున్న మూడు వారాల తర్వాత ఓ రోజు సాయంత్రం లయన్స్ క్లబ్ మెంబర్ అయిన బెనర్జీ చార్టర్డ్ నైట్‌లో కొంతమంది బీదవారికి ఉచితంగా కళ్ళజోళ్ళు ఇచ్చే కార్యక్రమం ఉంది.

పాతికమందికి లయన్స్ మెంబర్స్ అంతా కలిసి చందాలు వేసుకుని వాటిని ఆ రాత్రి హోటల్ డెక్కన్ కాంటినెంటల్‌లో అందచేసారు.

మరోసారి బెనర్జీకి మైత్రి తారసపడింది అక్కడే తన తండ్రితో వచ్చింది. ఆమెని చూసి గుర్తుపట్టి దగ్గరికి వెళ్ళి పలకరించాడు బెనర్జీ.

"ఏమిటిలా వచ్చారు?"

మైత్రి తన ఏభై రెండేళ్ళ తండ్రిని బెనర్జీకి పరిచయం చేసింది.

"ఈయన మా ఫాదర్. పేరు సుబ్బరామయ్య. ఈయనకి చాలా కాలంగా చత్వారం ఉంది. కంటి డాక్టర్, డాక్టర్ శ్రీనివాస్ మా ఫాదర్‌కి పరిచయం. మమ్మల్ని రమ్మని కోరారు" చెప్పింది.

"అలాగా."

బెనర్జీ మైత్రి తండ్రి వంక పరిశీలనగా చూసాడు. నాలుగు రోజులైనట్లుంది గడ్డం గీసి. పూర్తిగా తెల్లగా ఉంది గడ్డం. బనీను లేని ఛాతీ మీద జుట్టు కూడా తెల్లగా ఉంది.

"నమస్తే" చెప్పాడు బెనర్జీ ఆయనతో.

"నమస్తే" బదులుగా చెప్పాడాయన.

కంఠంలోని ఆయాసాన్ని గమనించి ఆయనకి ఊపిరితిత్తులకి సంబంధించిన వ్యాధి ఏదో ఉందనుకున్నాడు బెనర్జీ.

ఆయన తన కూతురు వంక ప్రశ్నార్థకంగా చూడటంతో చెప్పింది మైత్రి.

"ఆ రోజు ఫ్లవర్ షోలో పరిచయం అయ్యారు. పేరు బెనర్జీ."

బెనర్జీ మైత్రి చూసేలా తన దర్పాన్ని ప్రదర్శించాడు. ఆమె వినేట్లుగా తను సరదాగా యూరప్ చూడటానికి వెళుతున్నానని చెప్పాడు. కొత్తకారు విదేశం నుంచి దిగుమతి చేసుకుంటున్నానన్నాడు. రకరకాలుగా తన ఐశ్వర్యాన్ని ఆమెకి ఇన్ డైరెక్టుగా చెప్పాడు.

మైత్రి వెళుతూ మర్యాదకోసం అతనితో చెప్పింది.

"వెళ్ళొస్తాం. థాంక్స్."

"మళ్ళీ ఎప్పుడు మనం కలిసేది?" అడిగాడు ఆమెని.

"ఏమో?" జవాబు చెప్పింది.

"నాకు మిమ్మల్ని మరోసారి కలవాలనుంది."

"ఉంటానండి."

మైత్రి దూరంగా తన కోసం వేచి ఉన్న తండ్రి దగ్గరకి వెళ్ళింది. ఇద్దరూ బయటకి వచ్చాక చెప్పాడాయన.

"పెద్దవాళ్ళతో స్నేహం కొరివితో తల కొరుక్కోవడంలాంటిది."

"అబ్బే. అతనితో స్నేహమా? అలాంటిదేంలేదు నాన్నగారు."

కాక్ టెయిల్ డిన్నరులో బెనర్జీ డాక్టర్ శ్రీనివాస్‌ని అడిగాడు.

"సుబ్బరామయ్యగారని ఒకాయనకి కళ్ళజోడు ఇచ్చాం. ఆయన మీకు పరిచయమా?"

"ఆయనా? మా నాన్నగారి దగ్గర కాంపౌండర్‌గా పనిచేస్తుండేవారు. ఆయన పోయాక వేరే చోటకి మారాడు."

"ఆయన ఉండేది ఎక్కడో మీకు తెలుసా?"

"చిలకలగూడాలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కసందులోంచి రెండో ఇల్లనుకుంటాను."

తర్వాత బెనర్జీ ఖాసిమ్ అనే ఐరన్ బిజినెస్ చేసే వ్యక్తికోసం వెదికి పట్టుకున్నాడు. ఆయన నాలుగో పెగ్‌లో ఉన్నాడు.

"సలామాలేకుం" పలకరించాడు బెనర్జీ ఆయన్ని.

"ఆ లేకుం సలాం" చెప్పాడాయన.

అప్పటికే ఆయనకి నిషా బాగా ఎక్కిందని గుర్తించాడు బెనర్జీ.

"వ్యాపారం ఎలా ఉంది?" అడిగాడు బెనర్జీ.

"నష్టం. సగం సరుకుని ఎలుకలు తినేసాయి" చెప్పి తను వేసిన జోక్‌కి తనే పెద్దగా నవ్వాడు.

బెనర్జీ కూడా నవ్వి అడిగాడు.

"నాదీ నష్టమే. సాఫ్ట్ డ్రింక్స్‌ని పిచ్చుకలు తాగేసాయి"

ఆయన మరోసారి ఘొల్లున నవ్వి బెనర్జీ భుజం మీద గట్టిగా బాదాడు.

"మీ ఇంట్లో గులాబి తోట ఉంది కదూ!" అడిగాడు బెనర్జీ అసలు సంగతికి వస్తూ.

"ఓ.."

"మీ ఇంట్లోనే అనుకుంటా నల్లరంగు గులాబి మొక్కని చూసాను. అర్జెంట్‌గా నాకో మొక్క అవసరం పడింది. మీరేమయినా సహాయం చేయగలరా?" అడిగాడు బెనర్జీ.

"దేనికి?"

"నా ఫియాన్సీకి ప్రజెంట్ చేయడానికి."

వెంటనే ఖాసిమ్ మరోసారి ఘొల్లున నవ్వి, బెనర్జీ భుజం మీద తట్టి చెప్పాడు.

"అలా అయితే సరే. కంగ్రాట్స్. ఎవరా పిల్ల?" అడిగాడు.

"ఓ మేజర్ కూతురు. ఎక్కువ కాలం కాశ్మీర్ లో ఉండి వచ్చింది. రేపు ఉదయం రానా?" అడిగాడు బెనర్జీ.

"రేపు ఉదయందాకా దేనికి? ఇప్పుడే ఇస్తాను"

"ఏం ఫర్వాలేదు. "

"అలాంటి విషయాల్లో ఆలస్యం జరగకూడదు. భోజనం అయ్యాక వెళదాం."

బెనర్జీ ఖాసిమ్ వెంట ఆయన ఇంటికి వెళ్ళాడు కాని ఖాసిమ్ స్పృహలో ఉండగా కాదు. ఆయనకి మందు ఎక్కువ అవడంతో స్పృహలో లేకపోవడంతో తన కారులో తీసుకెళ్ళి వాళ్ళింట్లో దింపాడు. మర్నాడు ఉదయం వెళ్ళాడు నల్లరంగు గులాబీ మొక్క కోసం.

"ఏమిటి? ఈ గులాబీ మొక్క ఇస్తానన్నానా? ఎప్పుడు?" ఆశ్చర్యపోయాడు ఖాసిమ్.

"రాత్రి!"

"రాత్రి ఎప్పుడు?" అడిగాడు మళ్ళీ.

"పార్టీలో."

"నాకు గుర్తులేదు. కాని ఆ మాట అని ఉండను. ఇది చాలా అరుదయిన మొక్క. అంటుకూడా కట్టలేదు అందుకే. ఇంకా బలం పుంజుకోవాలి" చెప్పాడు ఖాసిమ్.

బెనర్జీ నిస్సహాయంగా చూడటంతో అడిగాడు.

"ఇంతకీ ఎందుకు?"

"నా ఫియాన్సీకివ్వడానికి అని చెప్పాగా."

"ఎప్పుడు?"

"రాత్రి" విసుగ్గా చెప్పాడు బెనర్జీ.

"రాత్రి నాతో మాట్లాడానంటున్నావు. నువ్వు మాట్లాడిన ఒక్కముక్క గుర్తులేదు నాకయితే."

"నీ ఇనప సామానులో సగం ఎలుకలు తినేసాయి అని అన్న సంగతి కూడా గుర్తులేదా?"

"లేదే అలా అన్నానా? మెడకాయమీద తలకాయవున్న ఎవరయినా ఆ మాటంటారా? లేక నన్ను ఆట పట్టిస్తున్నావా?" అడిగాడు ఖాసిమ్.

బెనర్జీకి ఏం మాట్లాడాలో తోచలేదు.

"పోనీ తెల్లరంగు గులాబి తీసుకెళ్ళివ్వు"

"వద్దులెండి"

బెనర్జీ మరో రెండురోజులపాటు నల్లరంగు గులాబికోసం ప్రయత్నించాడు. విశ్వంకూడా విశ్వప్రయత్నం చేసాడు. చివరికి ఊరుబయట ఓ ఇండస్ట్రియలిస్ట్‌కున్న ద్రాక్షతోటలో చిన్న గులాబి తోట ఉందని ఆయన దగ్గర దొరుకుతుందని తెలుసుకున్నాడు.

ఆయనకి, బెనర్జీ తండ్రికి మంచి స్నేహం ఉంది. ఆయన నో అనలేదు. మొత్తానికి ఓ నల్లపూల గులాబి చెట్టుని సంపాదించాడు.

మర్నాడు ఉదయం బెనర్జీ తన కారులో చిలకలగూడాలోని ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్ పక్క సందులో ఉన్న మైత్రి ఇంటికి చేరుకున్నాడు. ఆ సందులోకి తిరగగానే అతనికి మైత్రి ఇల్లు ఏదో ఇట్టే తెలిసిపోయింది. వాసాలతో కట్టిన దడి, ఇంటిముందు చక్కటి తోట చూసి అదే వాళ్ళిల్లు అని ఇట్టే గ్రహించాడు.

కాంపౌండ్ వాల్‌కి బయట కట్టిన దడికున్న వాసాల తలుపుతెరుచుకుంది. ఎదురుగా మైత్రి, హౌస్ గౌన్ లో అందంగా ఉంది.

"హలో" నవ్వాడు.

ఆమె అతని వంక గుచ్చి గుచ్చి చూసింది, అతను తనకి పరిచయం లేనట్లుగా.

"హలో. ఏమిటలా చూస్తున్నారు?" అని అడిగాడు మళ్ళీ.

"మీరు...?" అడిగింది ఆ అమ్మాయి.

"బెనర్జీని. ఇంతలోనే మతిమరుపా లేక అలా నటిస్తున్నారా?" అడిగాడు.

"రండి."

ఆమె వెంట లోపలికి నడిచాడు ముందుగది చాలా చిన్నగది.

గ్గాడ్రెజ్ మడత కుర్చీలు. ఓ మూల కిటికీ సిల్ మీద ఫ్లవర్ వేజ్ లోని రకరకాల పూలు ఆ గదికి ఎంతో అందం ఇస్తోంది. ఓ మూల ఉన్న పెద్ద పింగాణీ బేసిన్‌లో నీళ్ళు. అందులోంచి పెరిగిన మనీప్లాంట్ పైకి పాకి పెద్ద పెద్ద ఆకులతో ఎంతో అందంగా ఉంది.

గోడకి ఉన్న ఫోటో ఫ్రేముల్లో ఎలక్కాయల తొక్కలని అతికించి చేసిన ఏనుగు, సింహం బొమ్మలు లేమితనంతో పాటు కళాత్మకత కూడా ఆ గదిలో ఉట్టిపడుతోంది.

పంజాబీ డ్రస్‌లో ఉన్న మైత్రి బయటకి వచ్చింది.

"హలో" పలకరించింది చిన్నగా నవ్వి.

"మా ఇల్లెలా కనుక్కున్నారు?" అడిగింది అతని పక్కన ఓ కుర్చీని వదిలి మరో కుర్చీలో కూర్చుంటూ.

"ఈ సందులో వెళుతుంటే కనిపించాయి మీరు పెంచే గులాబీ బాలలు. ఇది మీ ఇల్లయి ఉంటుందనిపించి వచ్చాను. నా ఊహ కరక్టే."

"మీకు అబద్దాలాడటం రాకపోయినా అయివుండాలి లేదా సంభాషణా చాతుర్యం బాగా వచ్చి ఉండాలి" నవ్వి చెప్పింది మైత్రి.

"మొదటిదే కరెక్ట్. డాక్టర్ శ్రీనివాస్‌ని కనుక్కుని వచ్చాను"

"ఏమిటంత అవసరం?" అడిగింది.

బెనర్జీ ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు "మీ నాన్నగారు లేరా?" అడిగాడు.

"హాస్పిటల్‌కి వెళ్ళారు"

లోపలనుంచి ఓ అమ్మాయి గాజుగ్లాసులని ఓ కంచంలో ఉంచి తెచ్చింది. హౌస్‌గౌన్ లో ఉన్న ఆ అమ్మాయే తలుపు తెరిచిన వ్యక్తిగా గుర్తించగానే ఆశ్చర్యంగా ఇద్దరివంక మార్చి మార్చి చూసాడు బెనర్జీ.

"మీరిద్దరూ ఒకే విధంగా ఉన్నారేమిటి?" అడిగాడు.

"కవలలం కనక" నవ్వింది మైత్రి.

"ఐసీ.. అయినా ఇంత అచ్చుగుద్దినట్టుగానా?" మళ్ళీ ఆశ్చర్యపోయాడు అతను.

"ఇద్దరం నాలుగు నిముషాల తేడాతో పుట్టాం. దీని పేరు ధాత్రి. ఈయన మిష్టర్ బెనర్జీ" పరిచయం చేసింది మైత్రి అతన్ని ధాత్రికి.

"నమస్తే" చెప్పింది ధాత్రి.

"నమస్తే"

"నమస్తే"

"తీసుకోండి"

కంచంలోంచి ఓ గ్లాసుని అందుకున్నాడు. కొద్దిగా తాగి 'లైమ్ జ్యూసా?" అడిగాడు.

"అవును. ఇంటి వెనక చెట్టు ఉంది. అతిధులెవరొచ్చినా ఇదే ఇస్తాం" చెప్పింది మైత్రి.

బెనర్జీ జ్యూస్ తాగాక లేచి బయటకి వెళ్ళి కారు తలుపు తెరిచి వెనక సీటులో భద్రంగా ఉన్న పూలకుండీని లోపలికి తెచ్చాడు.

"అరె! నల్ల గులాబి" చెప్పింది ధాత్రి. కుండీలోని మొక్కకున్న సగం విచ్చుకున్న గులాబి పువ్వువంక సంతోషంగా చూసి

"అవును. మీకు మొక్కల పెంపకం హాబీనా?" అడిగాడు బెనర్జీ కుండీని ఓ మూలపెట్టి.

"ఉహూ. చెల్లాయికే అది మంచి హాబీ. నాకు పెయింటింగ్, చేతిపనులు" చెప్పింది ధాత్రి.

"ఆ రెండు మీరు చేసినవేనా?" అడిగాడు.

"అవును" గోడకి వేలాడుతున్న ఎలక్కాయల తొక్కలతో చేసిన జంతువుల బొమ్మలని చూసి చెప్పింది గర్వంగా.

"శ్రమ. దాన్నెందుకు తెచ్చారు?" అడిగింది మైత్రి నొచ్చుకుంటూ.

"శ్రమకాదు. ఆనందం. శ్రమతో కూడిన ఆనందం. కాశ్మీర్ నుంచి ఫ్లయిట్‌లో దీన్ని వాడిపోకుండా తేవడానికి చాలా శ్రమపడ్డాను. ఆ తర్వాత ఆనందపడ్డాను వాడిపోనందుకు. ఇంత కష్టపడి తెచ్చి మీకెందుకు ఇవ్వటం? నాకే తెలీదు" అన్నాడు నవ్వుతూ.

అయిదు నిముషాల తర్వాత లేచి చెప్పాడు.

"ఓ.కే వెళ్ళొస్తాను"

గుమ్మం దాకా వెళ్ళారు అక్క, చెల్లెళ్ళిద్దరు.

ఆగమని చెప్పి లోపలికి వెళ్ళి క్షణాల్లో చేతిలో మల్లెపూల చెండుతో బయటికి వచ్చింది ధాత్రి దాన్ని అతనికి అందించి చెప్పింది.

"మీది ఏ.సి కారుకదా, ఏ.సి ముందు దీన్ని వేలాడదీయండి. కారంతా మల్లెల వాసన వేస్తుంది"

"థాంక్స్"

బెనర్జీ వెళ్ళిపోయాక అడిగింది మైత్రిని ధాత్రి.

"ఎవరే ఇతను? ఎప్పుడూ చెప్పలేదే?"

"చూస్తే నీకెలా అనిపించాడు?" అడిగింది మైత్రి బదులుగా.

"మంచివాడిలా ఉన్నాడు"

"అందుకే నీది మెతక స్వభావం అంటారు. నాకయితే చెడ్డవాడులా ఉన్నాడు"

"ఇంతకీ ఇతనెలా పరిచయమో చెప్పనేలేదు"

మైత్రి అతనితో పరిచయం అయిన రెండు సంఘటనల గురించి టూకీగా చెప్పింది.

"ఇంతటి అతిచొరవ తీసుకుని ఇంటిని వెతుక్కుంటూ వచ్చే వాళ్ళంటే నాకు సదభిప్రాయం లేదు." పూర్తిచేసింది.

"అతనికి మొక్కలపిచ్చి ఉండబట్టేగా కాశ్మీర్ నుంచి దాన్ని తెచ్చింది. అభిరుచులు కలవబట్టి చొరవ తీసుకుని ఉంటాడు" సమర్థించింది ధాత్రి.

"అతని తరహానిబట్టి అతనికి కేవలం మొక్కలంటేనే ఇష్టం అనిపించటంలేదు నాకు" జవాబు చెప్పింది మైత్రి

ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

✷✷✷

ఆ రాత్రి బెనర్జీ తన ఫ్రెండ్ విశ్వనాథరావుకి జరిగింది చెప్పాడు.

"కంగ్రాచ్యులేషన్స్. కొంతలో కొంత ప్రోగ్రెస్ సాధించావన్నమాట"

"మైత్రి కాకపోతే ధాత్రి. ఎవరయినా నాకొకటే. తలమీది జుట్టు నుంచి కాలి వేళ్ళకింది చర్మందాకా ఇద్దరూ ఒక్కలానే ఉన్నారు. ఇట్ మేక్స్ నో డిఫరెన్స్" చెప్పాడు బెనర్జీ హుషారుగా.

ఇద్దరూ కేబరే డాన్స్ ఉన్న ఖరీదయిన బార్‌కి వెళ్ళారు.

"ఏం కావాలి సర్?" అడిగా స్టీవార్డ్ బెనర్జీని గుర్తుపట్టి పలకరింపుగా నవ్వి.

"అందమయిన బ్రాంది" చెప్పాడు బెనర్జీ.

అతనెళ్ళాక అడిగాడు బెనర్జీ.

"విస్కీనుంచి బ్రాందికి వచ్చావే"

"బ్రాంది ఎందుకో తెలుసా? అందులో 'బ్రా' ఉంది కాబట్టి"

"బ్రా అందంలోంచి పుట్టిన పదమే బ్రాంది" చెప్పాడు విశ్వం నవ్వి.

"బ్రాంది చాలా వాటికి నాంది. మొదటిసారి నేను అమ్మాయి దగ్గరకి వెళ్ళినప్పుడు భయం వేసింది. రెండు పెగ్గుల బ్రాందితో నా పదహారో ఏట మందుకీ, మగువకీ నాంది జరిగింది."

బ్రాంది వచ్చింది. ఇద్దరూ తాగుతూ ఫ్లోర్‌షో చూస్తున్నారు. నాలుగో పెగ్ తర్వాత స్టీవార్ట్ చెవిలో గుసగుసలాడాడు బెనర్జీ, అతను తిరిగి గుసగుసలాడాడు. పదిహేనువందలు చేతులు మారాయి.

"అంత డబ్బే?" అడిగాడు విశ్వం ఆశ్చర్యంగా.

"వనితకోసం చేసే విత్తం ఖర్చు ఎప్పుడు చేయదగ్గదే" చెప్పాడు బెనర్జీ.

"అసలు వనిత అంటే నీకు అర్థం తెలుసా?" అడిగాడు బెనర్జీ

"అమ్మాయి అని"

"అమ్మాయి అంటే అబ్బాయి కానిది అని అర్థం అసలు వనిత అంటే.." గ్లాసులోది ఖాళీచేసి ఆ వ్యాక్యాన్ని పూర్తిచేశాడు బెనర్జీ.

'వ'లపులతో 'ని'షానిచ్చే 'త'మాషా. ఇలాంటి తమాషా నిషా నివ్వగలిగేది అనుభవజ్ఞులయిన అలాంటి కేబరే ఆర్టిస్ట్‌లే తప్ప అమ్మాయిలంతా కాదురా పిచ్చి మొహమా, పదిహేను వందలు మళ్ళీ సంపాయించవచ్చు. కాని ఈ రాత్రిని, ఈ రాత్రి ఆనందాన్ని ఇక జీవితంలో ఎప్పుడూ పొందలేం. పొందితే రేపు రాత్రో, ఎల్లుండి రాత్రో, అంతే అలాంటప్పుడు తిరిగిరాని ఈ రాత్రిని ఎందుకు వృధా చేయవలెను? చెప్పుము"

బెనర్జీ ఆ కేబరే ఆర్టిస్ట్‌ని తనకారులో ఎక్కించుకుని కంపెనీ గెస్ట్ హౌస్‌కి దారితీశాడు.

ఆ రాత్రి ఆ అమ్మాయి 'వనిత'లానే ప్రవర్తించింది. బెనర్జీ ఖర్చు చేసిన పదిహేను వందల కిమ్మత్తు సుఖాన్ని అతనికి ఇచ్చింది.

✷✷✷

మైత్రిని కలిసిన వారం దాకా బెనర్జీ మళ్ళీ ఆమె ఇంటికి వెళ్ళలేదు. ఇలాంటివి నెమ్మదిగా సాధించాలి అనుకున్నాడు. కాని రోజూ అతనికి మైత్రి గుర్తువస్తూనే ఉంది.

ఆ రోజు ఉదయం బెనర్జీ తండ్రి చెప్పాడు.

"ఇవాళ టైపిస్ట్‌ల పోస్ట్‌లకి ఇంటర్వ్యూలున్నాయి. నీవు రా"

తండ్రి మాటకి ఎదురు చెప్పలేని బెనర్జీ ఆయన వెంట ఫాక్టరీకి వెళ్ళాడు. చాలామంది లేడీ టైపిస్ట్‌లే వచ్చారు. తండ్రి పక్కనే ఉండటం వల్ల బెనర్జీ నోరెత్తలేదు. వాళ్ళవంక సూటిగా కూడా చూడలేకపోయాడు.

ఇంటర్వ్యూ కొచ్చిన ఆరో అమ్మాయి మైత్రి. ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు. మైత్రి కూడా అతన్ని అక్కడ చూసి నిర్ఘాంతపోయింది.

"మీ పేరు?" అడిగాడు బెనర్జీ తండ్రి.

"మైత్రి" చెప్పింది.

"ఇదివరకటి అనుభవం?"

"టైప్ రైటింగ్ ఇన్స్టిట్యూట్ లో పార్ట్ టైం పని చేసాను. అక్కడికి వచ్చే ప్రయివేట్ వర్క్ అంతా నేనే చేసేదాన్ని. స్టేట్ మెంట్స్‌తో సహా ఏదయినా టైప్ చేయగలను సర్" చెప్పింది మైత్రి.

"మీరు వెళ్ళొచ్చు" చెప్పాడాయన.

బెనర్జీ వంక చూసింది మైత్రి.

"స్పీడెంత?" అడిగాడు.

"నిముషానికి అరవై"

తలవూపాడు వెళ్ళొచ్చన్నట్లుగా.

ఆ సాయంత్రం బెనర్జీ మైత్రి ఇంటికి వెళ్ళాడు.

"హలో" పలకరించింది.

ఆమె వేసుకున్న బట్టలు ఎంత హీనస్థితిలో ఉన్నాయో గుర్తించాడు. లయన్స్ క్లబ్ తరపున బహూకరించబడ్డ చత్వారం కళ్ళజోడు సహాయంతో ఇద్దరు పిల్లలకి పాఠాలు చెపుతున్న మైత్రి తండ్రి సుబ్బరామయ్య బెనర్జీతో ఒక్క ముక్క మాట్లాడలేదు. ఆయని తనంటే ద్వేషం ఉందనిపించింది బెనర్జీకి. అది తను ధనవంతుడు ఆయన బీదవాడు అవడం వల్ల అనుకున్నాడు కాని, తను మగాడు, ఆయనకి పెళ్ళికావలసిన పిల్లలున్నారు అవటంవల్ల అనుకోలేదు.

ఓ కవరిచ్చి లేచి నిలబడి చెప్పాడు.

"కంగ్రాట్స్"

మైత్రి బెనర్జీని అడగలేదు అదేమిటని. అతను వెళ్ళాక దాన్ని చింపి, కాగితం బయటికి తీసి చదివి చెప్పింది ధాత్రి.

"నీకు ఉద్యోగం వచ్చిందే"

సుబ్బరామయ్య పాఠం చెప్పడం ఆపి మైత్రి వంకక చూసాడు. ధాత్రి మోచేత్తో మైత్రిని పొడవడంతో ఆమె తడివంక చూసింది..

ఆయన మళ్ళీ పాఠాలు చెప్పసాగాడు. ఆ చూపు బాష పిల్లలిద్దరికి చిన్నప్పటినుంచీ అలవాటే. అతని దగ్గర ఉద్యోగంలో చేరడం సుబ్బరామయ్యకి ఇష్టంలేదని గ్రహించింది మైత్రి.

మర్నాడు ఉదయం బెనర్జీ మైత్రికోసం ఎదురు చూడసాగాడు. తనే ఆ ఉద్యోగాన్ని ఆమెకి వచ్చేలా చేసానని గ్రహించి, తనతో ఇదివరకటిలా అంటీముట్టనట్లుగా కాక, కృతజ్ఞతగా మాట్లాడుతుందనుకున్నాడు. మైత్రి తన ఆఫీస్‌లో చేరాక ఆమెని లొంగదీయడం ఎంతో తేలిక అనుకున్నాడు.

పన్నెండయినా మైత్రి రాలేదు. సుబ్బరామయ్య పన్నెండుంపావుకి వచ్చి ఓ కవరు, ఓ పూలకుండీ నిశ్శబ్దంగా బెనర్జీ టేబుల్ మీదపెట్టి, వచ్చినంత చడీ చప్పుడూ లేకుండా వెళ్ళిపోయాడు.

కవరు అందుకుని చూసాడు. అతను ఊహించినట్లుగా అతనిచ్చిన గులాబిచెట్టుకాదు. మరోటి

చెట్టుకాండానికి దారంతో కట్టిన ఓ దళసరి కాగితం వేలాడుతోంది. దాన్ని అందుకునిచూసాడు.

"ఫ్రం మైత్రి విత్ థాంక్స్" అన్న నాలుగు పదాలు ఇంగ్లీష్‌లో రాసి ఉన్నాయి.

ఆ చెట్టువంక చూసాడు. పూలు లేవు. అతనికి మైత్రి అది ఎందుకు పంపిందో అర్థంకాలేదు.

ఓ ఆకుని తుంపి వాసన చూస్తే అదేం చెట్టో తెలుస్తుందనుకుని ఓ ఆకుని ముట్టుకున్నాడు. క్షణాల్లో అది ముడుచుకుపోయింది. గబగబా అన్ని ఆకులని చేత్తో తాకాడు. అన్నీ ముడుచుకుపోయాయి.

ఆ చెట్టు ఏమిటో అప్పుడు అర్థం అయింది బెనర్జీకి అది ఎందుకు పంపిందో కూడా అర్థం అయింది.

హిందీలో లాజ్ వంతి.

ఇంగ్లీష్ లో టచ్ మి నాట్.

తెలుగులో అత్తిపత్తి ఆ చెట్టు పేరు.

బెనర్జీకి అర్ధమైంది ఆమె కేరక్టర్. ఉద్యోగం ఆశ చూపి, చిన్న చిన్న బహుమతులిస్తూంటే, తనని ఎంతో మర్యాదగా చూసినవాళ్ళే అతనికి గతంలో పరిచయం. మైత్రిలాంటి మనిషి ఉంటుందని మొదటిసారిగా గ్రహించాడు బెనర్జీ.

ఓ వారందాకా మళ్ళీ అతను ఆమె ఇంటికి కాని, అసలా ఇంటి ఛాయలకే వెళ్ళడానికి ధైర్యం చేయలేదు. కాని ఆ వారం రోజులు మైత్రి అతని మనసుని తొలుస్తూనే ఉంది. ఆమె నిరాకరణో లేక తను నిజంగా మైత్రిమీద మనసు పడ్డాడో బెనర్జీ ఎనలైజ్ చేసుకోలేకపోయాడు.

ఓ రోజు బెనర్జీ తమ ఆఫీసులో పనిచేసే అమ్మాయిని ఓ హోటల్ కి తీసుకెళ్ళాడు. ఆ రాత్రి పోలీసులు హోటల్ని రెయిడ్ చేసి నాలుగు జంట్లని పట్టుకున్నారు. అందులో ఒకడు బెనర్జీ. అతనెవరో తెలిసాక పర్సనల్ బాండ్ మీద అతన్ని వదిలారు. కాని ఆ సంగతి బెనర్జీ తండ్రికి తెలియచేసాడు రెయిడ్ చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్.

"చూచాయగా వింటున్నా, మొదటిసారిగా మనమే ఇలాంటి పాడు పనులకి దారి ఇస్తున్నామేమో?"

"నిజమే" చెప్పాడాయన.

✷✷✷

*(ఇంకా ఉంది)*

Post your comments